క్లుప్తంగా

పోలేరమ్మ ఆలయ అభివృద్ధికి రూ.2 లక్షల విరాళం



విరాళం అందజేస్తున్న మెడికల్ ఆఫీసర్ శ్రీనివాసరావు

సంతనూతలపాడు: స్థానిక అంబేడ్కర్ నగర్‌లోని పోలేరమ్మ ఆలయ అభివృద్ధికి దాత, మెడికల్ ఆఫీసర్ బల్లికురవ శ్రీనివాసరావు రెండు లక్షల రూపాయల విరాళం అందజేశారు. శుక్రవారం ఆలయాన్ని సందర్శించి ఆలయ అభివృద్ధి ప్రతినిధి మార్పుడి శ్రీనివాసరావుకు ఆ మొత్తాన్ని అందజేశారు. సంతనూతలపాడుకు చెందిన బల్లికురవ వెంకట్రావు కుమారుడు, శ్రీకాకుళం జిల్లా సీతంపేట ఏరియా హాస్పిటల్ మెడికల్ ఆఫీసర్ అయిన శ్రీనివాసరావు స్వచ్ఛందంగా ఆలయాభివృద్ధికి విరాళం అందజేయడంతో పలువురు అభినందించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు పలతోటి శివరామకృష్ణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి ప్రతినిధులు బి.ఏడుకొండలు, కిషోర్, రామకృష్ణ, వెత్రీనివాసరావు ఎన్.బాబు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసుపై విచారణ



కేసును విచారిస్తున్న ఒంగోలు డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ సుబ్బారావు

చీమకుర్తి రూరల్: మండలంలోని బక్కిరెడ్డిపాలెంలో యానాదులపై జరిగిన దాడితో పాటు కులం పేరుతో దూషించారని బాధితులు ఫిర్యాదు చేయగా, సీఐ సుబ్బారావు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసిన విషయం విధితమే. ఈ కేసు విచారణ నిమిత్తం ఒంగోలు డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ సుబ్బారావు శుక్రవారం బక్కిరెడ్డిపాలెం వెళ్లారు. విచారణలో ఎంఆర్పీఎస్ నాయకులు జడ విజయ్, పాటిబండ్ల గంగయ్య, ఎలమంద బాబు, శంకర్, పాటిబండ్ల వంశీ, జకరయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో పచ్చదనం కనిపించాలి



మొక్కలు నాటుతున్న విజయకుమార్, సీఐ సాంబశివరావు, ఎస్సై సుబ్బారావు


కొత్తపట్నం: అన్ని ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ పచ్చదనం కనిపించడానికి మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని సన్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సీహెచ్ విజయకుమార్ సూచించారు. కొత్తపట్నంలోని కోస్టల్ సెక్యూరిటీ పోలీస్‌స్టేషన్ ఆవరణలో సన్ హెల్పింగ్ పీపుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్లాంటేషన్ కార్యక్రమం నిర్వహించి అవగాహన కల్పించారు. స్టేషన్ ఆవరణలో పండ్ల మొక్కలు, పూల మొక్కలు 40కిపైగా నాటారు. మెరైన్ సీఐ ఎస్.సాంబశివరావు, ఎస్ఐ పి.సుబ్బారావు, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో ఎం.రత్నజ్యోత్స్న, సీహెచ్ విజయకుమార్, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ హరి, సీహెచ్ కిషోర్ కుమార్, మెంబర్ బోయలపల్లి ప్రభావతి చేతుల మీదుగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మెరైన్ సీఐ, ఎస్సైలకు ఫౌండేషన్ తరఫున ప్రశంస పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మెరైన్ సిబ్బంది, సన్ హెల్పింగ్ పీపుల్ ఫౌండేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

కోదండ రామునికి ఏకాదశ వార్షికోత్సవాలు

ఒంగోలు మెట్రో: స్థానిక శ్రీరాంకాలనీలో శుక్రవారం ఉదయం కోదండ రామాలయ ఏకాదశ వార్షికోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఏర్పాటు చేసిన సీతారాముల కళ్యాణోత్సవం నేత్రపర్వంగా సాగింది. వేద పురోహితుడు రాజేష్ బృందం ఆధ్వర్యంలో జరిపించిన కళ్యాణం అనంతరం రాత్రి వేళ దేవేరులకు ఊంజల్ సేవ, మహా మంగళహారతులు అందజేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



రామలింగేశ్వరస్వామి ఆలయ శిఖరం



రామలింగేశ్వరస్వామి ఆలయం ముందున్న కోనేరు



రావణబ్రహ్మ వాహనంపై కన్నేశ్వరస్వామి (ఫైల్)

బ్రహ్మోత్సవానికి వేళాయే..!

- మడనూరులో ఈ నెల 25 నుంచి రామలింగేశ్వరస్వామి, కన్నేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు
- మహాశివరాత్రి సందర్భంగా ఐదు రోజుల పాటు ఉత్సవాలు
- ముస్తాబవుతున్న ఆలయాలు
- వేలాది సంఖ్యలో పాల్గొననున్న భక్తులు

కొత్తపట్నం: జిల్లాలోనే ప్రసిద్ధిగాంచిన కొత్తపట్నం మండలం మడనూరు గ్రామంలోని గంగా పర్వత వర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి, కన్నేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలను ఈ నెల 25 నుంచి మార్చి 1వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నారు. జిల్లా నలుమూలల నుంచి వేలాది సంఖ్యలో భక్తులు పాల్గొననున్నారు. ప్రతి ఏటా అట్టహాసంగా నిర్వహించే బ్రహ్మోత్సవాలలో భారీగా భక్తులతో పాటు ఎంతో మంది ప్రముఖులు పాల్గొని పూజలు చేస్తారు. ఐదు రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాలలో రోజుకో ప్రత్యేక అలంకరణలో భక్తులకు స్వామివారు దర్శనమిస్తారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఇప్పటికే ఆలయానికి రంగులు వేయడంతో పాటు ఆలయం చుట్టూ ఉన్న నాపరాళ్లకు మరమ్మతులు చేస్తున్నారు. ప్రత్యేక పూజలు, హోమాలు, స్వామివార్లకు కల్యాణం వంటి కార్యక్రమాలకు ఏర్పాటు చేస్తున్నారు.

మడనూరు రామలింగేశ్వరస్వామి స్థల పురాణం...

త్రేతాయుగంలో శ్రీరాముడు పంచవటి వద్ద లక్ష్మణ, సీతలతో వనవాసం చేస్తున్న రోజుల్లో రావణాసురుడి చెల్లెలు సూర్పణక శ్రీరాముడుని చూసి మోహించింది. తన కోరిక తీర్చమని, వివాహం చేసుకోమని కోరింది. కానీ, శ్రీరాముడు నిరాకరించాడు. కానీ, సూర్పణక బలవంతం చేయడంతో లక్ష్మణుడు కోపం చెంది ఆమె ముక్కు, చెవులు కోశాడు. ఆమె లంకకు వెళ్తుండగా మార్గంలో ముక్కు ఈ ప్రాంతంలో పడటంతో ఈ ప్రాంతానికి ఇంతిముక్కల (స్త్రీ ముక్కు పడిన ప్రదేశం)గా, మడుగులా రక్తం పడినందుకు మడుగూరగా పేరు వచ్చింది. కాలక్రమేణా ఈ పేర్లు ఈతముక్కల, మడనూరుగా మారాయి. శ్రీరాముడు లంకలో రావణాసుర వధ అనంతరం అయోధ్యకు తిరిగి వెళ్తూ తనపై ఉన్న బ్రహ్మత్య పాతక నివారణకై శివలింగాలను ప్రతిష్టిస్తూ వచ్చాడు. అందులో భాగంగా మడనూరులో శివలింగ ప్రతిష్టకై ఏర్పాటు చేశారు. హనుమంతుడు కాశీ నుంచి శివలింగం తీసుకురావడం ఆలస్యమవడంతో శ్రీరాముడు ఇక్కడున్న మట్టితో లింగాన్ని తయారు చేసి సైకతలింగంగా మార్చి సీతతో కలిసి ప్రతిష్ఠించాడు. శివలింగ ప్రతిష్ఠ కోసం లక్ష్మణుడు తన బాణంతో పాతాలం నుంచి జలాన్ని తెప్పించి అభిషేకం చేయించాడు. అదే ప్రస్తుతం ఆలయం వద్ద ఉన్న లక్ష్మణుడి కోనేరు. అనంతరం హనుమంతుడు కాశీ నుంచి శివలింగాన్ని తెచ్చాడు. అంతకంటే ముందుగానే శివలింగం ప్రతిష్ఠ జరగడంతో హనుమంతుడు కోపం చెంది అలిగాడు. అప్పుడు శ్రీరాముడు నువ్వు తెచ్చిన కాశీస్పటిక లింగాన్ని ఈతముక్కలలో ప్రతిష్ఠించాలని, అక్కడ దర్శించుకున్న తర్వాతే మడనూరులో తాను ప్రతిష్ఠించిన శివలింగాన్ని భక్తులు దర్శించుకుంటారని వరమిచ్చాడు. ఈతముక్కలలో హనుమంతుడు ప్రతిష్ఠించిన స్పటిక లింగానికి గంగా భ్రమరాంబ సమేత కన్నేశ్వరస్వామి అని, మడనూరులో శ్రీరాముడు ప్రతిష్ఠించిన శివలింగానికి రామలింగేశ్వరస్వామి అని పేరు. ఈ జంట దేవుళ్లకు ప్రతి ఏటా కళ్యాణం, మహాశివరాత్రి సందర్భంగా ఐదు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తారు. పెళ్లిపెద్దగా ఈతముక్కల నుంచి అనంత కోదండరామస్వామి రావడం ఆనవాయితీ.



రామలింగేశ్వరస్వామి ఆలయం ముందు ధ్వజస్తంభం



శ్రీరామలింగేశ్వరస్వామి రథోత్సవం (ఫైల్)

బ్రహ్మోత్సవాల్లో రోజువారీగా కార్యక్రమాల వివరాలు...

ఈ నెల 25 నుంచి మార్చి 1వ తేదీ వరకు రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఈవో సుబ్రహ్మణ్యం తెలిపారు. 25వ తేదీ రాత్రి 10 గంటలకు అంకురార్పణ, 26న మహాశివరాత్రి సందర్భంగా అభిషేకాలు, పూజా కార్యక్రమాలు, రాత్రి లింగోద్భవ కాలంలో ప్రత్యేక అభిషేకాలు జరుగుతాయి. 27వ తేదీ వేకువజామున జంట స్వాములకు కళ్యాణం నిర్వహిస్తారు. అనంతరం సముద్రస్నానం చేస్తారు. రాత్రి 7 గంటలకు అన్నదానం చేస్తారు. రాత్రి 10 గంటలకు నాలుగు దేవుళ్ల ఉత్సవం, నరనంది, హనుమంత వాహనం, రావణబ్రహ్మ వాహనం, గజవాహనాలపై రామలింగేశ్వరస్వామి, కోదండరామస్వామి, కన్నేశ్వరస్వామి, జ్వాలాముఖి అమ్మవార్లను పూలు, విద్యుత్ దీపాలంకరణలతో జంట గ్రామాల్లో అత్యంత వైభవంగా ఉత్సవాలు నిర్వహిస్తారు. భారీగా బాణసంచా కాలుస్తారు. 28న సాయంత్రం 5 గంటలకు మడనూరు నుంచి ఈతముక్కలకు రథోత్సవం జరుగుతుంది. రాత్రికి అక్కడ నిద్రచేసి మరుసటి రోజైన మార్చి 1న ఈతముక్కలలో పూజలు చేసి అక్కడి నుంచి బయలుదేరుతుంది. సాయంత్రానికి మడనూరు చేరుతుంది. జిల్లాలో రెండు రోజులు నిర్వహించే అతి పెద్ద రథోత్సవం ఇదే. ఈ రథోత్సవాన్ని చూడటానికి జిల్లా నలుమూలల నుంచి వేలాదిగా భక్తులు తరలివస్తారు. ఐదు రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాలకు పోలీసులు బందోబస్తు కూడా ఏర్పాటు చేస్తారు.

అమృతం కన్నా తియ్యనైనది.. మాతృభాష



స్టెప్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో వివిధ వేషధారణలో విద్యార్థులు



కరవదిలో చుండూరు రవిబాబును సన్మానిస్తున్న చినవెంకటేశ్వర్లు

- వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు

ఒంగోలు సిటీ: అమ్మ ప్రేమలా స్వచ్ఛమైనది.. చిన్నారుల నవ్వులా అచ్చమైనది.. అమృతం కంటే తియ్యనైనది మన మాతృభాష అని వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు అన్నారు. మహనీయులను స్మరించుకుంటూ అందరికీ మాతృభాష దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఒంగోలు మండలంలోని కరవది గ్రామంలో గల శ్రీవాణి నికేతన్ పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన అంతర్జాతీయ మాతృభాష దినోత్సవంలో రవిబాబు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తెలుగు భాష గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం కరస్పాండెంట్ చిన్న వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో రవిబాబును సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఒంగోలు మండల అధ్యక్షుడు మన్నే శ్రీనివాసరావు, కరవది ప్రెసిడెంట్ కోటేశ్వరరావు, సుబ్బారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

డీఎస్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో...

ఒంగోలులోని డీఎస్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో తెలుగు శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు కళ్యాణి మాతృభాష గొప్పతనం గురించి వివరించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. కుమారి అంజనా సాయి తేనె కన్నా తీయనిది తెలుగు అంటూ చక్కగా నాట్యం చేయగా, ఫస్ట్ బీకాం నుంచి కుమారి శ్రావణి సోది చెపుతానమ్మ అంటూ వచ్చి మాతృభాషను నిర్లక్ష్యం చేయవద్దని, సెల్‌ఫోన్లని అనవసరంగా వాడవద్దని హాస్యంతో కూడిన సందేశమిచ్చింది. ఫస్ట్ బీఏ నుంచి అనూష, తదితరులు తెలుగు భాష గొప్పతనం.. తెలుగు భాష తీయదనం అంటూ పాట పాడారు. అనంతరం ఫస్ట్ ఫైనల్ బీకాం నుంచి హారిక మాతృభాష లంబాడి భాషలో మాట్లాడుతూ అందరికీ శుభాకాంక్షలు తెలియజేసింది. తెలుగు శాఖ అధ్యక్షులు పి.యామిని అమ్మాజీ, భౌతిక శాస్త్ర అధ్యక్షులు డాక్టర్ ఇందిరా, సుష్మ, సురేష్, ఇతర అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



ఒంగోలు డీఎస్ కళాశాలలో సాంస్కృతిక ప్రదర్శన నిర్వహిస్తున్న విద్యార్థులు

స్టెప్ ఆధ్వర్యంలో ఘనంగా మాతృభాష దినోత్సవం

ఒంగోలు సిటీ: జిల్లా యువజన సంక్షేమ శాఖ, స్టెప్ ఒంగోలు ఆధ్వర్యంలో శుక్రవారం మాతృభాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఒంగోలులోని రాంనగర్ మున్సిపల్ పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, విచిత్ర వేషధారణ, కవితలు వంటి వివిధ అంశాలలో పోటీలు నిర్వహించారు. స్టెప్ సీఈఓ పి.శ్రీమన్నారాయణ పాల్గొని విద్యార్థులకు మాతృభాష గొప్పతనం గురించి తెలియజేశారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు జిల్లా యువజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధి కల్పనాధికారి టి.భరద్వాజ్, పాఠశాల హెచ్ఎం ఎంఎస్ శర్మ, స్టెప్ అకౌంటెంట్ జీబీఆర్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

చీమకుర్తి: మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరుతూ శుక్రవారం చీమకుర్తి మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. ఆప్కాస్ విధానాన్ని రద్దు చేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. ఆప్కాస్ విధానాన్ని రద్దు చేయటం వలన కార్మికులను ప్రైవేటు ఏజెన్సీలకు అప్పజెప్పాల్సి వస్తుందన్నారు. దాని వలన కార్మికులకు సకాలంలో జీతాలివ్వడంలో జాప్యం చేస్తారని ఆందోళన వ్యక్తం చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్ల సంఘ నాయకులు ఏడుకొండలు, పద్మ, వెంకటేశ్వర్లు, కోటేశ్వరి పాల్గొన్నారు.



కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న మున్సిపల్ కార్మికులు

మత్తు పదార్థాలు వినియోగిస్తే కఠిన చర్యలు

చీమకుర్తి రూరల్: మత్తు పదార్థాలు వినియోగిస్తే కఠిన చర్యలు తప్పవని చీమకుర్తి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎం.సుకన్య హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని బూదవాడ సచివాలయం పరిధిలోని మర్రిచెట్లపాలెం ఎస్టీకాలనీ వాసులకు, గ్రానైట్ వర్కర్లకు నాటుసారా, గంజాయి వంటి మత్తు మందులు వినియోగిస్తే కలిగే పర్యావసానాలపై కౌన్సిలింగ్ నిర్వహించారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఎం. శ్రీనగేష్ గ్రానైట్ ఫ్యాక్టరీలలోనే నివాసం ఉండే గ్రానైట్ వర్కర్లకు గంజాయి, డ్రగ్స్ వినియోగం వలన కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. ఎవరైనా గంజాయి, డ్రగ్స్ వాడుతుంటే.. ఆ వివరాలను సీఐకి తెలియజేయాలని, చెప్పిన వారి పేరు, వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.



కౌన్సిలింగ్ ఇస్తున్న ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖాధికారులు

పెళ్లిలో మర్యాదల గొడవ

ఒంగోలు టౌన్: నగరంలో జరిగిన ఒక వివాహంలో వడ్డింపుల దగ్గర జరిగిన ఘర్షణ దాడులకు దారితీసింది. పోలీసుల కథనం ప్రకారం... నగరంలోని గుంటూరు రోడ్డులో కొత్తగా నిర్మించిన ఒక కళ్యాణ మండపంలో గురువారం రాత్రి ఒక వివాహానికి సంబంధించిన విందు జరిగింది. షేక్ జిలాని భోజనాలు వడ్డిస్తున్నారు. తమకు సరైన మర్యాద చేయలేదని అన్వర్, నజీర్, షోయబ్ అలియాస్ నూరి ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఇద్దరి మధ్య వాదన జరిగింది. పక్కనున్నవారు సర్దిచెప్పడంతో అప్పటికి వెళ్లిపోయారు. అంతటితో ఆ వివాదం సమసిపోయిందని అంతా అనుకున్నారు. చినికి చినికి గాలివానగా మారుతుందని భావించలేదు. విందు పూర్తయిన తర్వాత సామగ్రి సర్దుకుంటూ ఉండగా తిరిగి వచ్చిన ఆ ముగ్గురు వ్యక్తులు జిలానీపై దాడి చేశారు. దీంతో కుటుంబ సభ్యులు జిలానీని ఒంగోలు జీజీహెచ్‌కి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఒంగోలు తాలూకా పోలీస్‌స్టేషన్ సీఐ అజయ్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా, దీనిపై టీడీపీకి చెందిన ఇరువర్గాల మధ్య ఘర్షణలా ప్రచారం జరుగుతోంది.

మున్సిపల్ దుకాణాల్లో విభిన్న ప్రతిభావంతులకు 5 శాతం

ఒంగోలు వన్‌టౌన్: అన్ని జిల్లాల్లోని మున్సిపల్ దుకాణ సముదాయాల్లో విభిన్న ప్రతిభావంతులకు 5 శాతం దుకాణాలు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసినట్లు నవ్యాంధ్ర వికలాంగుల హక్కుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఎస్కె కాలేషా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదే విధంగా అద్దెను 50 శాతం మాత్రమే విభిన్నప్రతిభావంతుల నుంచి వసూలు చేసేలా ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు.

ఘనంగా శునకరాగాలు గ్రంథావిష్కరణ



కార్యక్రమంలో పాల్గొన్న కళామిత్రమండలి, నరసం సభ్యులు

ఒంగోలు మెట్రో: స్థానిక ఎన్టీఆర్ కళాకేంద్రంలో శుక్రవారం సాయంత్రం కళామిత్రమండలి (తెలుగు లోగిలి) సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం నిర్వహించారు. సంస్థ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ నూనె అంకమ్మరావు అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. తెలుగుతల్లి చిత్రపటానికి పూలమాలలు వేసిన అనంతరం నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం (నరసం) గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ రచించిన శునకరాగాలు గ్రంథాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. డీఈవో కిరణ్‌కుమార్, జనసేన నాయకుడు కంది రవిశంకర్, నరసం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సింహాద్రి జ్యోతిర్మయి, సాహితీ పోషకులు వీరవల్లి సుబ్బారావు (రుద్రయ్య), నాగభైరవ సాహిత్య పీఠం అధ్యక్షుడు డా.నాగభైరవ ఆదినారాయణ, నరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాతూరి అన్నపూర్ణ, చందనకవి పోతుల పెద వీరనారాయణ, శ్రీకృష్ణదేవరాయ సాహిత్య సాంస్కృతిక సేవాసమితి అధ్యక్షుడు కుర్రా ప్రసాద్ బాబు, సాహితీ పోషకుడు ఓరుగంటి ప్రసాద్ తదితరులు మాట్లాడారు. కర్నూలు జిల్లా రచయిత గద్వాల సోమన్న బాలల కోసం రచించిన పిల్ల తెమ్మెరల గేయ గ్రంథాన్ని కూడా అతిథులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అనేక రంగాల్లో కృషి చేస్తున్న వివిధ జిల్లాల కవులు, కళాకారులు, సామాజిక సేవారంగ ప్రముఖులకు తెలుగు భాషా విశిష్ట సేవా సత్కారం అందజేశారు. అనంతరం వ్యాసరచన, వేషధారణ పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ముందుగా చందు డ్యాన్స్ అకాడమీ చిన్నారులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కోవెలకుంట్ల బాలకోటయ్య, బీరం అరుణ, జీవీ శేషగిరిరావు, మహతి తన్నీరు బాలాజీ, కందుల మధు తదితరులు నిర్వహణ సహకారాన్ని అందించారు.

వాటర్ ప్లాంట్ మాయం..!

- రూ.10 లక్షల విలువైన సామగ్రిని మాయం చేసినా పట్టించుకోని అధికారులు
- మూడు నెలలుగా స్పందించలేదని విమర్శిస్తున్న ప్రజలు

సంతనూతలపాడు: మండల కేంద్రంలోని పెద్ద బజారులో మద్దూలూరు రోడ్డులో గ్రామ పంచాయతీకి చెందిన వాటర్ ప్లాంట్‌ను కొందరు ప్రైవేటు వ్యక్తులు మూడు నెలల క్రితం ధ్వంసం చేసి మాయం చేశారు. నేటికీ దాని గురించి పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై ప్రజలు విమర్శిస్తున్నారు. గ్రామ కంఠం సర్వే నంబర్ 997/1లో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో 2008వ సంవత్సరంలో శుద్ధ జలం కింద కేటాయించిన రూ.10 లక్షల నిధులతో ఈ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. విలువైన నీటి శుద్ధీకరణ మిషన్లతో స్వచ్ఛమైన నీటిని ప్రజలకు అందించారు. అయితే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మూడు నెలల క్రితం వాటర్ ప్లాంట్‌ను అధికార పార్టీ అనే అహంకారంతో కొందరు ధ్వంసం చేశారు. వాటర్‌ప్లాంట్ షెడ్డుతో పాటు అందులోని పరికరాలను మాయం చేశారు. ఆ స్థలం తమదంటూ అడ్డగోలుగా వ్యవహరించారు. స్థలం వివాదంపై పంచాయతీవారు కోర్టుకు వెళ్లారు. దీంతో వాటర్ ప్లాంట్‌ను మాయం చేసిన వారు కూడా కోర్టుకు వెళ్లారు. కోర్టులో ఉన్న స్థల వివాదాన్ని పక్కనపెడితే.. అసలు వాటర్ ప్లాంట్‌ను, అందులోని పరికరాలను మాయం చేయడంపై అధికారులెవరూ పట్టించుకోకపోవడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సంకే సుబ్బారావు, తదితరులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంలో మండల పరిషత్ అధికారి ప్రమేయం ఉన్నట్లు ఆరోపణలు ఉండగా, ఉన్నతాధికారులు సైతం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించడంపై తీవ్రస్థాయిలో విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ ఆస్తిని ధ్వంసం చేస్తే ఎలాంటి చర్యలూ తీసుకోకపోవడం ఏంటని, జిల్లా స్థాయి అధికారులైనా స్పందించి ప్రభుత్వ ఆస్తిని ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



మూడు నెలల ముందు గ్రామంలో ఉన్న పంచాయతీ వాటర్ ప్లాంట్ (ఫైల్)



వాటర్ ప్లాంట్ తొలగించిన తర్వాత ప్రస్తుత చిత్రం